www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024

5



'కూళ్ల 'రెవెన్యూ సదస్సు రసాభాస



కూళ్లలో రెవెన్యూ సదస్సు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కూళ్ళ గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సు రసాభాసగా ముగిసింది. ఇక్కడ గుమి గూడిన రైతులంతా రీ సర్వే పాస్ బుక్ రద్దు చేయాలని ఆందోళన చేపట్టారు. కొత్త విధానాన్ని రద్దుచేసి పాత పాస్ బుక్కులను కొనసాగించాలని వారంతా నినాదాలు చేశారు. రైతుల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని సమావేశంలో అధికారులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీచర్ ఎంఎల్‌సికి 16,316 మంది ఓటర్లు

- పురుషులు 9,674, స్త్రీలు 6,642
- తుది జాబితాను వెల్లడించిన రిటర్నింగ్

అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తంగా 16,316 మంది ఓటర్లు నమోదయ్యారు. తుది ఓటర్ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సిగిలి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. టీచర్ ఎంఎల్‌సికి సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. కలెక్టర్ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాలు, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్, ఎంఇఒ, పోలింగ్ స్టేషన్లలో బుధవారం నుంచి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉమ్మడి తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలో 113 మండలాల్లో మొత్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 9,674 మంది, స్త్రీలు 6,642 మంది ఉన్నారని తెలిపారు. 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 614 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో 19 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,893 మంది ఓటర్లు, ఏలూరు జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,605 మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు 3,333 మంది ఓటర్లు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు, 3,209 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 3,662 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

11 నుంచి నామినేషన్లు స్వీకరణ

టీచర్స్ ఎంఎల్‌సికి సంబంధించి ఈనెల 11 నుంచి 18 వరకూ కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు.

ఈ ఎన్నికకు సంబంధించి కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాలు డిఆర్‌ఒలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

23 వరకూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 23 వరకూ పెంచారన్నారు. ఈనెల 6తో గడువు ముగిసిందని, దీనికి సంబంధించి 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వస్తుందన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 23 వరకూ ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 నవంబర్ 1కి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 15 సంవత్సరాల స్టడీ కంప్లీట్ చేసి ఉండాలని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇప్పటివరకు 1,74,772 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. దీనికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలు , ఏలూరు జిల్లాలో 45 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కాకినాడ డిఆర్‌ఒ జె.వెంకట్రావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు చర్యలు : ఐజి



ముమ్మిడివరం పిఎస్‌లో రికార్డులు తనిఖీచేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నేర నియంత్రణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేసే చర్యలు చేపడుతున్నామని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ జివిజి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ లో ఐజి అశోక్ కుమార్ రికార్డులను మరియు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న హత్య ఇతర కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిని ఛేదించడానికి ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో అసాంఘిక కార్యకలాపాల్లో ఉన్న వ్యక్తుల వివరాలు వేలు ముద్రలు సేకరించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివాదాలకు కారణమవుతున్న ఫ్లెక్సీల నియంత్రణకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనాల ద్వారా గంజాయి రవాణా, అమ్మకాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనినిఅరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి బి.కృష్ణారావు, అమలాపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్, స్థానిక ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తో పాటు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు లాభదాయకం



సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - అంబాజీపేట

సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు లాభదాయకమే కాకుండా ఆరోగ్యకరంగా ఉండవచ్చని రైతు సాధికార సంస్థ పి.గన్నవరం డివిజన్ ఎమ్‌టి(మాస్టర్ ట్రయినింగ్) జనిపెళ్ల నాగవేణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహిళా రైతుల వ్యవసాయ ఉత్పత్తుల సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తి ప్రదర్శన మరియు అమ్మకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి నేరుగా వినియోగదారునికి ప్రకృతి సేంద్రీయ ఉత్పత్తులు అందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రకృతి సేద్యంలో అధిక ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చు అన్నారు. వ్యవసాయ ఉత్పత్తిలను ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో విత్తనాల శేఖర్, మైల ఆనందరావు, కొర్లపాటి కోట బాబు, సూదాబత్తుల రాము, ముత్తాబత్తుల ప్రశాంత్, ఐసిఆర్‌పి సిబ్బంది దామోదర్, కె.మల్లేశ్వరి, ఎం.దుర్గాభవాని, ఎం.సరిత, శ్రీ లక్ష్మి జొన్నాడ కనక లక్ష్మి బీర రజని, పి.దుర్గా లక్ష్మి, విజయ కుమారి, పలువురు పాల్గొన్నారు.

సమస్యలపై 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - అమలాపురం

104 రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా ఉద్యోగుల డిమాండ్ల పరిష్కరించాలని బుధవారం డిఎంహెచ్‌ఒకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా 104 ఉద్యోగుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు అని కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతోందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహిస్తే రూ.50 వేలు సరిపోతుందని, దీని వలన ప్రజల ధనం వధా కాకుండా చూడాలన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్స్ మరియు డిఇఒలకు జిఒ నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరవిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలన్నారు. డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లకు కాంట్రాక్ట్ పద్ధతి అమలు చేయాలని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలనీ 104 వాహనాలకు ఫిట్నెస్, ఇన్సూరెన్స్ చేయించాలనీ ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు, ఆపరేటర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు. **కొత్తపేట:** 104 రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అవిడి పిహెచ్‌సిలో నోడల్ ఆఫీసర్ సుమలతకు 104 ఉద్యోగుల వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్లు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.



కొత్తపేట మండలం అవిడివినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు



అమలాపురంలో డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

డిఇఒకు కలిసిన లయన్ జివి.రావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మోడరన్ విద్యాసంస్థల అధినేత జివి.రావు అంబేద్కర్ కోనసీమ డిఇఒ సలీం బాషాను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ విద్యా పరంగా చైతన్యం గల అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఇఒగా సలీం భాషా భాధ్యతలు స్వీకరించడం ఆనందదాయకం అన్నారు. మరిన్ని సేవలు అందించాలని డిఇఒను కోరారు. డిఇఒ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కషి చేస్తున్న జివి.రావు కషి అభినందనీయం అని కొనియాడారు . గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు సేవలందిస్తాం రావు ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

8న ఉపకరణాల అందజేత శిబిరం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వికలాంగులకు అవసరమైన ఉపకరణాలను ఈ నెల 8న ఉచితంగా అందించేందుకు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ముమ్మిడివరం ఎంపిడిఒ టి.వెంకటాచార్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నియోజక వర్గ ప్రధాన కేంద్రమైన ముమ్మిడివరం మండల మరియు పట్టణ ప్రాంతాలకు చెందిన వికలాంగులను గుర్తించి ఉచిత చలన ఉపకరణములను అందించేందుకు అల్మికో(ఎఎల్ఐఎంసిఒ) సంస్థ ఈ నెల 8న టిటిఆర్ (తాడి తాతారావు కళ్యాణ మండపం నందు) ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ఉంటుందన్నారు. చలన ఉపకరణములు అవసరమైన వికలాంగులు ఈ శిబిరానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .ఈ శిబిరానికి వచ్చే వికలాంగులు దారిద్ర్య రేఖకు దిగువ చెందిన వారై ఉండాలని, వార్షిక ఆదాయం రూ.2.70 లక్షలకు లోబడి ఉండాలన్నారు. దీనితో పాటు సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు కలిగి ఉండాలని, 40 శాతం పైబడి వైకల్యం కలిగి ఉండాలని, ఆదాయ ధ్రువీకరణకు సంబంధించి రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలని, రెండు ఆధార్ జిరాక్స్, రెండు పాస్ పోర్టు సైజ్‌ఫొటోలతో పాటు శాశ్వత చిరునామా తెలిపే గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అంతే కాకుండా నియోజక వర్గంలోని కాట్రేనికొన, ఐ పోలవరం మరియు తాళ్లరేవు మండలాలకు చెందిన వికలాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

370 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవ కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు.2024-25 ఖరీఫ్ సీజన్లో ఆరుగాలం శ్రమించి పండించిన పండించిన ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తులకు అమ్ముకొని మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న కనీసం మద్దతు ధరలు పొందాలని ఆయన రైతులకు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిధి లోని ద్వారపూడి- 3 రైతు సేవా కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా బుధవారంనుండి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఖరీప్ ధాన్యం కొను గోలులో విధి విధానాల మేరకు రైతులకు కొనుగోలు సమయంలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన సహకారం అంది స్తామని తెలిపారు. రైతు తనకు నచ్చిన మిల్లును ఎంచుకునే అవకాశం ప్రస్తుత సీజన్లో కల్పించామన్నారు. రైతుకు రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరుగాలం శ్రమించి పం డించిన రైతులు నష్టపో కూడదనే లక్ష్యంతో ధాన్యం సేకరణలో నాణ్యత ప్రమాణాలకు లోబడి వున్న ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని అన్నారు. ఇందుకు గాను కోనసీమ జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనే సంచులను, హమాలీలను, రవాణా వాహనాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. వీటిని రైతులే సమ కూర్చుకుంటే అందుక య్యే వ్యయాన్ని కూడా ప్రభుత్వమే నేరుగా రైతు ఖాతాల లో జమ చేస్తుందన్నారు. ఖరీఫ్ 2024-25 కనీస మద్దతు ధర కింద సాధారణ రకం క్వింటా ధాన్యం రూ.2300లు, 75 కేజీల ధాన్యానికి రూ.1725. గ్రేడ్ ఏ రకం క్వింటా ధాన్యానికి రూ.2320, 75 కేజీల ధాన్యానికి రూ.1740 రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. ధాన్యం కొనుగోలు చేసే సమయములో ప్రతి దశలోను రైతులు తమ మొబైల్ కి సందేశం పంపించడంతో పాటు ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించదలచిన తేది, సమయంతో కూడిన కూపన్ రైతుకు అందజేస్తామన్నారు. నిర్దేశించిన తేదిన సాంకేతిక నిపుణుడు రైతు కల్లం వద్దకు వచ్చి ధాన్యం నమూనాలను సేకరించి, ప్రభుత్వం వారు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను విశ్లేషించడం జరుగుతుంద న్నారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నట్లయితే సదరు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన రైతు,నామిని నుంచి బయోమెట్రిక్ వేలి ముద్రలు తీసుకోవడం జరుగుతుందని, ధాన్యం వివరాలతో కూడిన రశీదు రైతుకు అందజేస్తారన్నారు. ఈ వివ రాలు అన్ని సమాచారం రూపంలో రైతు చరవాణికి సందేశం పంపబడుతుందన్నారు. సేకరించిన ధాన్యాన్ని రైతు కోరిన రైస్ మిల్లుకు జిపిఎస్‌తో కూడిన వాహనాల్లో రవాణా చేయబడుతుం దన్నారు. సేకరించిన ధాన్యం యొక్క వివరాలు ఆన్లైన్లో నేరుగా రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపబడుతుందన్నారు. అక్కడ నుంచే రైతు ఆధార్కు లింక్ అయిన బ్యాంకు ఖాతా కు నేరుగా 48 గంటలలో సొమ్ము జమ చేస్తారన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్‌డిఒ డి.అఖిల, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, డిఎస్ఒ ఉదయభాస్కర్, మార్కెటింగ్ శాఖ ఎడి కె.విశాలాక్షి, జిల్లా సహకార అధికారి మురళీ కృష్ణ, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ద్వారపూడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం: ఖరీఫ్ పంటకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.చిన్నారావు అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని టేకి రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 14 రైతు సేవ కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరి ధాన్యం సిద్ధంగా ఉన్నట్లయితే రైతు సేవా కేంద్రానికి తెలియజేసి రైతులు ధాన్యం విక్రయించుకోవాలన్నారు. జిపిఎస్ ద్వారా వెళ్లాలని సూచించారు. బయట మిల్లులకు కూడా ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం ఉంది కాబట్టి మీకు ఇష్టమైన మిల్లులకు విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ, సొసైటీ సిఇఒ విజయ్ కుమార్, విఆర్ఒ వెంకటేశ్వరరావు, పి.నాగమణి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ జి.హరిబాబు, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, రైతులు పాల్గొన్నారు.



ఐదు కిలోల శిశువుతో వైద్యులు

ఐదు కిలోల శిశువు జననం

ప్రజాశక్తి - కొత్త పేట

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక గర్భిణికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ఐదు కిలోల బిడ్డని తీశారు. కాయల తబిత జ్యోతి(రావులపాలెం సచివాలయ ఉద్యోగి) గర్భిణి. ఆమెకు బుధవారం ఉదయం 10:30 గంటలకు ఆస్పత్రికి రాగా వైద్యులు ఆమెకు ఉమ్మినీరు ఎక్కువగా ఉండటం, స్థూలకాయత్వం అధిక బరువు (90కేజీ) ఉండటంతో పాటు బేబి బరువు కూడా ఎక్కువగా ఉన్నట్లు తెలియజేశారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు వివరించారు. అనంతరం డాక్టర్ ఎన్.అన్నపూర ఆధ్వర్యంలో గర్భిణి జ్యోతికి శస్త్రచికిత్స నిర్వహించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.దుర్గాప్రసాద్ తెలియ జేశారు. దాదాపు ఐదు కిలోల బరువు గెల బేబిని ఇబ్బంది లేకుండా ఎటువంటి ఆలస్యం కాకుండా డెలివరీ చేయడం తనుకు ఎంతో ఆనందాన్నిచ్చిందని గర్భిణి భర్త అయిన రాంబాబు తెలియజేశాడు

అగ్ని ప్రమాద బాధితులకు ఎంఎల్‌ఎ పరామర్శ



అగ్ని ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ ఆనందరావు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కూనవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలను బుధవారం ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ఈ అగ్ని ప్రమాదంలో బూసి సత్యనారాయణకు చెందిన కాఫీ హోటల్, కుంచే వెంకటరమణకు చెందిన టైలరింగ్ షాపు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలతో ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఆయన వెంట మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ పండు వెంకటేశ్వరరావు, నాయకులు ఆకుల రాము,సాకా రాంబాబు, వాకపల్లి సత్యనారాయణ,ఆకుల బుజ్జి, నాగిరెడ్డి రాంబాబు, ఆకుల రాజా, విఆర్ఒ కె.సూర్యకుమారి తదితరులు ఉన్నారు.


ఫ్యామిలీ డాక్టర్‌తో రోగులకు మెరుగైన సేవలు



గుమ్మిలేరులో సిబ్బందికి ఆదేశాలిస్తున్న డిఎంహెచ్‌ఒ దుర్గారావు దొర

ప్రజాశక్తి - ఆలమూరు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ సువర్చల దేవి, డాక్టర్ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ఆయన బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆయనను ముందుగా గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు పూల మొక్కతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ స్థాయిలోని రోగులకు వైద్య సేవలను అందించడంతో పాటు కదలలేని వారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మధుమేహం, బిపి వంటి రోగులు ప్రతినెలా గ్రామాల్లోనే పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు పొందుతున్నారన్నారు. రోగులకు వైద్యసిబ్బంది సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. అలాగే పిహెచ్‌సి పరిధిలో అధిక శాతం డెలివరీలు నమోదయ్యేటట్లు సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జ్యోతి కుమార్, ఎమ్ఎల్‌హెచ్‌పి జాస్మిన్, అంగన్‌వాడీలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు సర్టిఫికెట్ల అందజేత



శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం ఎపిఆర్‌టిసి డిపోలో నిర్వహించుస్తున్న హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు తొమ్మిదో బ్యాచ్ లో 16 మంది అభ్యర్థులతో 32 రోజులు శిక్షణ పూర్తయింది. ఈ సందర్భంగా అమలాపురం డిపో నందు బుధవారం సర్టిఫికెట్లు ప్రదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్య క్రమానికి రవాణా శాఖ అధికారి వి.శ్రీనివాస రావు ముఖ్య అతిధిగా విచ్చేశారు. అయన శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు .ఈ సందర్భంగా డిపో మేనేజర్ సిహెచ్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ ఆర్‌టిసి శిక్షణ కళాశాల నందు డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు బస్సు మెయింటినెన్స్ విషయము పట్ల అవ గాహన కల్పిస్తామన్నారు. . అతి త్వరలో పదవ బ్యా చ్ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ఆసక్తి గల అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ ఎండి రజాక్‌ను 7382909588 సంప్ర దించాలని ఆయన తెలియజేశారు.

సిఎంను కలిసిన మంత్రి సుభాష్



సిఎం చంద్రబాబుతో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం ఎంఎల్ఎ, కార్మిక శాఖ మంత్రి అయిన వాసంశెట్టి సుభాష్ బుధవారం మంత్రి మండలి సమావేశం అనంతరం సిఎం చంద్రబాబు నాయుడును వ్యక్తిగతంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన వివరించారు. టిడిపి సభ్యత్వాలు, ఎంఎల్‌సి ఓటింగ్ నమోదులో వెనకబడినమంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సిఎం చంద్రబాబు కొద్ది రోజుల క్రితం మందలించారు. బుధవారం సిఎం కలిసిన మంత్రి సుభాష్ 90 శాతం వరకు ఎంఎల్‌సి ఓట్ల నమోదు అయిందని వివరించారు. దీనితో చంద్రబాబు మాట్లాడుతూ నమోదు శాతాన్ని 90 శాతం దాటించి యువ నాయకుల అంటూ ప్రోత్స హించారని మంత్రి తెలిపారు. రామచంద్రపురం నియోజవర్గంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సిఎం దృష్టికి తీసుకువెళ్లి వివరించానని, కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించు కుంటామని హామీ ఇచ్చామని మంత్రి సుభాష్ తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు తెలిసేలా ప్రజా ప్రతినిధులు అంతా సమిష్టిగా కషి చేయాలని సిఎం సూచించారని సుభాష్ వివరించారు.



ఆవిష్కరిస్తున్న ఎంపీ గంటి హారీష్

వాలీబాల్ టోర్నీ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం

కాట్రేనికోన మండలం చిలకాయిచెరువులో స్టేట్ వాలీబాల్ ప్లేయర్ మోర్త ప్రతిష్ట ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించు ఫ్రెండ్స్ స్టేట్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ బ్రోచర్ ని బుధవారం ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి కాట్రేనికోన మండల నాయకులు వెంట్రు సుధీర్, గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి సీతారామకృష్ణరాజు, నాయకులు కంచర్ల కృష్ణ, పిన్నమరాజు రంగరాజు, దండు వాసురాజు, ముమ్మిడివరం నగరపంచాయతీ టిడిపి నాయకులు భీమవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాజులూరు మండలం శలపాక గ్రామంలో గత నెల 31న జరిగిన ముగ్గురి హత్యకు కారకులైన ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి రఘువీర్‌విష్ణు తెలిపారు. స్థానిక సర్పవరం సర్కిల్ పోలీస్‌స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎదురుఎదురు ఇళ్లలో నివాసం ఉంటున్న బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబాల మధ్య మనస్పర్థలు కారణంగా ఈ సంఘటన చోటుచేసుకుందని అన్నారు. దీపావళి రోజున ఒక పథకం ప్రకారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో పొట్లకాయల నాగేశ్వరరావు, అతని భార్య బేబి, వారి కుమారులు సుబ్రమణ్యం, దొరబాబు, వినోదు ఇనుప రాడ్లు, మంచం పట్టి కర్రలతో బత్తుల చిన్నయ్య, అతని కుమారుడు బత్తుల రమేష్, తమ్ముడు బత్తుల రాజుపై విచక్షణ రహితంగా దాడిచేసి అతి కిరాతంగా హత్య చేశారని చెప్పారు. వారిని అడ్డుకోబోయిన బత్తుల శ్రీనుపైనా దాడి చేసి గాయపర్చారని తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. శలపాకల గ్రామంలో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కాజులూరు ఎస్ఐ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాన్ షాప్‌లో చోరీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్ సమీపంలో ఉన్న పాన్ షాప్‌లో గుర్తుతెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి చోరీ చేసినట్లు షాపు యజమాని బండి శ్రీను బుధవారం తెలిపారు మంగళవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి వెళ్లి బుధవారం వ్యక్తిగత పనులపై యానం వెళ్లి సాయంత్రం దుకాణం తెరవగా పైకప్పుకు రంధ్రం పడి ఉందన్నారు. పై కప్పుకు రంధ్రం పెట్టి లోపలకు దిగి సుమారు రూ.20 వేలు విలువ చేసే సరుకులు దోచుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పుష్కర కాలువ గట్టు నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ని మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్‌ని తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ ఆదేశాలతో గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాటు సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

శంఖవరం మండలం రాజవరం గ్రామ పరిసరాల్లో ఉన్న నాటు సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ పి.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై నిఘా పెట్టామని అన్నారు. ఎవరైనా నాటు సారా తయారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుని దుర్మరణం

ప్రజాశక్తి - కాత్రేనికోన

చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లంకురు శివారు పోర పొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(20) అక్కడికక్కడే మరణించాడు. చెందాడు. అమలాపురం రొయ్యలు కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువుతో కలిపి ఇంటికి వెళుతుండగా చెయ్యరు హై స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలంలో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.సంఘటన జరిగిన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి-నల్లజర్ల

తన భర్త వరకట్నం కోసం చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని భార్య నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపల్లి గ్రామానికి చెందిన కపిల బాలనాగ వీర వెంకటలక్ష్మికి 2003లో కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్‌తో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం అయినప్పటి నుండి ఆమె తీసుకొచ్చిన కట్నం సరిపోలేదంటూ భర్త పలుమార్లు ఆమెను పుట్టింటికి పంపించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మే నెలలో ఆమెను భర్త పుట్టింటికి పంపించగా గ్రామ పెద్దలు పరిష్కరించి ఆమెను భర్త వద్దకు పంపించారు. అయినప్పటికీ భర్త ప్రవీణ్ కుమార్‌లో ఎలాంటి మార్పు రానందున మరల చిత్రహింసలకు గురి చేయడంతో ఆమె నల్లజర్ల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో భర్త ప్రవీణ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి, ఎం.శ్రీరామమూర్తి, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె.పార్థసారధి జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కలిసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ 50 శాతం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల కోరారు. జర్నలిస్టుల వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి బుధవారం ఇందుకు సంబంధించిన సర్కులర్ జారీ చేశారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ఈ ఉత్తర్వులు అమలయ్యేలా జిల్లా పాఠశాల విద్యాధికారి, డిప్యూటీ విద్యాధికారులు, ఆఫీసర్, మండల విద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆ సర్కులర్‌లో కలెక్టర్ ఆదేశించారు.

సాగు నీరందక ఎండుతున్న పొలాలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అంది సమయానికి రైతు ఏదో విధంగా దెబ్బతింటున్నాడు. దీంతో నష్టాలబారి కూలిపోయి అప్పుల పాలవుతున్నాడు. కౌలు రైతులు పరిస్థితి అయితే మరి దయనీయంగా మారింది. వివరాల్లోకి వెళితే మండలంలోని 17 గ్రామాల్లో 4,700 ఎకరాలలో రైతులు వివిధ రకాల వరినాట్లు వేశారు. దాదాపు 50 శాతం పైనే పంట గింజ దశకు వచ్చాయి .కొంతమంది రైతులు 16, 18 స్వర్ణ రకం వరి నాట్లు వేయడంతో పొట్ట, ఈనికి దశలో ఉన్నాయి. గత వారం రోజులుగా బొబ్బర్లంక మధ్య డెల్టా ప్రధాన కాలువ పరిధిలోగల లొల్ల లాకులు వద్ద ముక్తేశ్వరం, అమలాపురం, గన్నవరం కాలులకు నీటిమట్టం తగ్గించడంతో వరిసేలకు సాగునీరందక బీడు వాడుతున్నాయి. గన్నవరం పంట కాలువ పరిధిలోగల అంకంపాలెం, నార్కెడిమిల్లి గ్రామాల్లో సుమారు 150 ఎకరాలకు సాగునీరందక పొట్ట, ఈనిక దశలో ఉన్న వరి పొలాలు సాగునీరు లేక బీటల వారి ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

8 ఎకరాలు కౌలుకు తీసుకున్నా



8 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పండిస్తున్నాను. కొత్తరకం వరి వేయడంతో ఈనిక, పొట్ట దశలో ఉన్నాయి. కాలువలు నీటిమట్టం తగ్గించడంతో పంట పొలాలకు నీరు అందడం లేదు దీంతో పొలాలు బీడుబారి పంట ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని అధికారులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

-రావూరి తాతయ్య నాయుడు, కౌలు రైతు

పట్టించుకోని అధికారులు

ఈ విషయంపై జల వనరుల శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న కార్యాలయాలు చుట్టూ కాళ్ల అరిగేలా తిరిగిన వారు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన చెందుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు కళ్ళముందే ఎండిపోతుంటే చేసేది ఏమీ లేక రైతు ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికే వాతావరణం గాలుల్లో మార్పులతో చలి గాలులు వేయడంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో వరి చేలకు తరచూ నీరు పెడుతూ ఉండాలని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగచేసుకుని ఎండిపోతున్న పంట పొలాలకు తాగునీరు అందించాలని అంకంపాలెం పాటి చెరువు గ్రామ రైతులు కోరుకుంటున్నారు.



గన్నవరం పంటకాలువ పరిధిలోని గ్రామాల్లో సాగునీరందక బీడువారిన వరి పొలాలు



ర్యాలీలో పాల్గొన్న పలువురు నాయకులు

అమరవీరుల సంస్మరణ ర్యాలీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతికి తూలూరి ప్రేమానందం అధ్యక్షతన బుధవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు సంతాపం తెలియజేసి, జోహార్ అంటూ నినాదాలు చేశారు. ముఖ్యవక్తగా హాజరైన సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లానాయకులు జె.సత్తిబాబు మాట్లాడుతూ దేశంలో సమ సమాజ స్థాపనకు భూమి, భుక్తి, విముక్తి కోసం దున్నేవానికి భూమి కావాలన్నారు. బివి లంక భూ పోరాటంలో తూలూరి మరియమ్మ, దానం విజయులు ప్రాణాలు అర్పించారన్నారు. అమరవీరులు అందించిన స్ఫూర్తితో పోరాటం ముమ్మరం చేయాలన్నారు. అడవి సంపదను సామ్రాజ్యవాద కంపెనీలకు దారాదత్తం చేస్తూ గిరిజన జీవితాలతో ప్రభుత్వ ఆటలాడుకుంటున్నాయన్నారు. వ్యతిరేకించి, పోరాడుతున్న విప్లవకారులను నక్సలైట్ల పేరుతో కాల్చి చంపుతున్నారని దీనిని ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బడుగు వెంకట్రావు, కప్పల చిన్న సూర్యారావు, మోటుపల్లి నాగేశ్వరరావు, బొచ్చే భాస్కరరావు, దారా అప్పారావు, రేలంగి ఆదమ్మ, బడుగు కళావతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంఎల్ సి ఓటు నమోదు ప్రచారం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నిక ఓటు నమోదుకు అర్హులైన పట్ట భద్రులకు ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ సోదరుడు బాబి ఆధ్వర్యంలో ఐ.పోలవరం మండలం జి.వేమవరం గ్రామంలో ఉన్న ప్రత్యేక బందం బుధవారం పర్యటించి ప్రచారం నిర్వహించింది. ఈ బృందం కాజులూరు, కె.గంగవరం, అల్లవరం, అంబాజీపేట మండలంలో ఉన్న పట్టభద్రులకు అవగాహన బుధవారంతో ముగించింది. బాబి మాట్లాడుతూ ఇంకా మిగిలి ఉన్న పట్టభద్రులు గతంలో ఓటు ఉన్న వారు కూడా ఈ సారి ఎన్నికలో ఓటు వేయాలంటే మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవలసిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 23తేదీ వరకు పారం-18 ఆఫ్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకో వచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి బ్రహ్మానందం, కోళ్ల వీర భద్రరరావు, ముంగి కష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండల పార్టీ అధ్యక్షులు అరిగెల నానాజీ, సలాది పుల్లయ్య నాయుడు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు మద్దాల సుబ్బారావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు



దాతలను సత్కరిస్తున్న ఆలయ ఉద్యోగులు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్య అన్నదాన ట్రస్ట్‌కు ఐ.పోలవరం మండలం. గుత్తినదీవికి చెందిన కంతేటి రామకృష్ణమూర్తి, విజయలక్ష్మి దంప తులు రూ.1,00,008 బుధవారం విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ ఎం .సత్యనారాయణ రాజు తెలిపారు. దాత దంపతులకు ఆలయ సిబ్బంది స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి. స్వామివారి శేష వస్త్రం., చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

11న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నవంబర్ 11న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పిలుపు ఇచ్చింది. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడి సరుకులు అధిక ధరలను నియంత్రించాలని, బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 36 రంగాల పనులు నిలుపుదల చేసి 11న కలెక్టరేట్‌కు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు

రైతుల సమస్యలపై నాయకుల సమీక్ష

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గారపాటి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై చర్చించారు. పొలాలకు 9 గంటలు ఇవ్వాల్సిన కరెంటును 8 గంటలు మాత్రమే ఇస్తున్నారని, దీనివల్ల రైతులకు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని తెలిపారు. నారుమళ్ల సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక నారుమళ్లు ఎండి పోతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కరెంట్ బిల్లు పెంచడం వల్ల రైతులపై అధిక భారం పడుతోందని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా రైతు భరోసా అంద లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు కంకటాల బుద్ధుడు, రామనాథం మురళీకృష్ణ, ఆలపాటి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో ఇటీవల జరిగిన విద్యుతాఘాతంతో మరణించిన వారి కుటుంబ సభ్యులను బుధవారం రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. పార్టీ తరపున మతుల కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున నగదు రూపేణా ఆర్థిక సహాయం ఆయన స్వయంగా అందజేశారు. ఉదయం మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ కూడా బాధితులను పరామర్శించారు.

మండల సమాఖ్య ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం డ్వాక్రా మండల సమాఖ్య ఎన్నిక బుధవారం నిర్వహించారు. మండల గ్రామ సంఘాల విఓఎలు ఐదుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎపిఎం పెనుమాక రోజ్ మాణిక్యం తెలిపారు. మండలంలో 53 గ్రామ సంఘాలు ఉండగా 48 మంది విఓఎలు మండల సమాఖ్య కార్యాలయంలో ఎన్నికకు హాజరైనట్లు తెలిపారు. 43 మంది సభ్యులు కలిసి ఐదు మంది బాడీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన మండల సమాఖ్య అధ్యక్షురాలుగా కాకర్ల రామ తులసి, వైస్ ప్రెసిడెంట్‌గా పాబోలు రాధిక, సెక్రటరీ మల్లె మొగ్గల యశోద, కోశాధికారి మల్లిపూడి రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చు మహాలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన బాడీ ఎన్నికైన అనంతరం ఎపిఎం రోజ్ మాణిక్యం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండల సమాఖ్య ప్రెసిడెంట్ కాకర్ల తులసి మాట్లాడుతూ మండలంలో ఉన్న రికవరీలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల సమాఖ్య అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని ఆమె తెలిపారు. డ్వాక్రా రుణాలు, ప్రత్యేక లోన్లు అందించే విధంగా మహిళల ఆర్థికాభివద్ధి కృషి చేస్తామని ఆమె తెలిపారు. డ్వాక్రా సంఘాలు సభ్యులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

నైపుణ్య గణనపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి మూర్తి ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్‌పై ట్రైనింగు ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న యువతీ యువకులను గుర్తించి అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా సర్వే చేయడానికి తర్ఫీదు శిక్షకులు ఫణి కుమార్, ధన రాజేష్ సచివాలయం సిబ్బందికి తరగతులు నిర్వహించారు. ఎలాంటి నైపుణ్యాలకు డిమాండ్ ఉందో అలాంటి నైపుణ్యం కలిగిన వారు ఎంత మంది ఉన్నారు. డిమాండ్‌కు, లభ్యతకు మధ్య అంతరం ఎంత ఉంది వంటి విషయాలను అంచనా వేయడానికి శిక్షణ ఇచ్చారు.స్కిల్ సెన్సస్ ద్వారా యువతలో నైపుణ్యాలను గుర్తించి, అవసరమైన మేరకు మెరుగుపరిచడానికి దోహద పడుతందని ఇఒపిఆర్‌డి మూర్తి తెలిపారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెంచి అసలైన అభివృద్ధి. నిజమైన సంక్షేమం. యువత తన కాళ్లపై తాము నిలబడేందుకు అనుగుణంగా ప్రభుత్వం దీన్ని రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ టి.గణేష్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ శివ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 80 మంది ఎంపిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరవ్వగా 80 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిధిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థీ ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ బహుళ జాతి సంస్థలు బెంగళూరు నుంచి, రాజమండ్రికి చెందిన కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు.

యానాం వార్తలు

పిడబ్ల్యూడి అధికారులతో ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ(పిడబ్ల్యూడి) అధికారులతో ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం పలు సమస్యలపై సమీక్షించారు. పెండింగ్లో ఉన్న పనులపై అధికారులను ఆర్‌ఎఒ మునిస్వామి సమక్షంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిఎస్ఆర్, ఎంఎల్‌ఎ నిధులు, ఎడి వెల్ఫేర్ ద్వారా జరగాల్సిన పనులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయని ప్రశ్నించారు. పుదుచ్చేరిలో ఉన్న సంబంధిత సెక్రటరీ, డైరెక్టర్లతో సిఎస్ఆర్ నిధులు మొదటి ఫేస్, ఎన్ఐటిలో ఉన్న 9 పనులకు సంబంధించి ఫోన్లో మాట్లాడారు. వన్ స్టాప్ సెంటర్, కనకాలపేట ఇండోర్ స్టేడియంలో పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసి తక్షణమే ప్రారంభించాలన్నారు. అరటికాయలంక నుంచి జండా స్థంభం వరకూ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఫైనాన్స్ సమస్యలు ఉంటే తనకు తెలపాలని, పుదుచ్చేరి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్‌ఎఒ, ఇఇలకు సూచించారు. ప్రధాన రహదారుల్లో గ్యాస్ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మున్సిపల్ శాఖలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రజా పనుల శాఖ ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ల నాగరాజు, జెఇ జ్యోతిరాజు, భాస్కర్, పురపాలక శాఖ జెఇ కుమార్, ఆదిబాబు, వేణు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి

ప్రజాశక్తి - యానాం

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రత్నప్రభ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పనిదినాల్లో శిక్షణను నిలిపివేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాఠశాల పని దినాల్లో హెచ్‌ఎంలకు శిక్షణను నిలిపివేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురుదుర్రు గ్రామం పాఠశాల హెచ్‌ఎం పివి.రత్నకుమార్ మృతికి ఆయన సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగిరిపల్లిలో జరిగిన హెచ్‌ఎంల శిక్షణ తరగతుల్లో ఉండి మండలం గురుదుర్రు గ్రామానికి చెందిన హెచ్‌ఎం పివి.రత్నకుమార్ గుండెపోటుకు గురై మృతి చెందడం విచారకరమన్నారు. ప్రధానోపాధ్యాయులకు పని దినాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను నిలుపుదల చేయాలని ఆగస్టు 16న, పలుమార్లు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరినా చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇటువంటి సంఘటన జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో పరీక్షలు నిర్వహించే సమయం, అపార్, 10వ తరగతి నామినల్ రోల్స్ సమర్పించాల్సిన సమయం, మెగా పేరెంట్ సమావేశం నిర్వహించాలని ఒక పక్క చెబుతూనే మరోపక్క రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహించడం సరైంది కాదన్నారు. ఏకకాలంలో అనేక పనులను అప్పగిస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు.

జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు గురుకులం విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు రాజమహేంద్ర వరంలోని శ్రీ సత్యసాయి గురుకులం విద్యార్థిని వర్రి మోనిషా ఎంపికైంది. ఇటీవల మన్యం జిల్లా పార్వతీపురంలో 68వ ఎపి స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో మోనిషా పాల్గొని ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించింది. తద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోనిషాను అభినందించారు. ముఖ్యఅతిథిగా వ్యాపారవేత్త తుమ్మిడి అరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక ధ్రుడత్వంతో పాటూ మానసిక స్థయిర్యం, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. తద్వారా చదువులోనూ రాణించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో క్రీడాశక్తిని గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం శ్రీ సత్య సాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపల్ కె.గుర్రయ్య మాట్లాడారు. తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ఈ నెలాఖరున గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీలకు వర్రి మోనిషా పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం కమిటీ సభ్యులు సోమసుందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీరామగుప్త తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన తుమ్మలపల్లి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలను బుధవారం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఆర్‌ఒ ప్లాంట్ పనిచేయడం లేదని, వాటర్ సరిపోవడం లేదని, నూతనంగా ట్యాంక్ నిర్మించాలని తెలిపారు. కేర్ టేకర్ పోస్ట్ ఖాళీగా ఉన్నందున కాళీ పోస్టును భర్తీ చేయాలని, పిల్లలకు గదులు సరిపోకపోవడంతో నాలుగు గదులు అవసరమని, బెడ్స్ ఏర్పాటు చేయాలని రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలను సందర్శించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదిలం మురళి, గాజింగం నాని, ప్రగడ ప్రభ, గుల్లింకల నాని, శివ రామకృష్ణ, నాగేశ్వరరావు, నరేంద్ర, శవ, దేవి, పాండవులు, రామకృష్ణ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, ముఖ్య శిక్షకులు పి.సురేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ క్రీడా శాఖపై ఈ నెల 4వ తేదీన జరిగిన క్రీడా శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు విధాన నిర్ణయాలు తీసుకున్నారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ముఖ్య శిక్షకులు పి.సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర రాష్ట్రాల కంటే మిన్నగా ఎపి క్రీడా పాలసీని ప్రవేశపె ట్టారన్నారు ఇందులో ఇప్పటి వరకు ఉన్న 2 శాతం క్రీడా రిజర్వే షన్లను 3 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నార న్నారు. తొలుత దీన్ని యూనిఫామ్ సర్వీసెస్ లో అమలు చేయాలని సూచించారని 'అందరికీ క్రీడలు' అనే విధానంతో నూతన క్రీడా పాలసీని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రాన్ని, అమరావతిని 'క్రీడా హబ్" గా మార్చేందుకు వీలుగా స్పోర్ట్స్ ఫర్ ఆల్ , టాలెంట్ సెర్చ్, స్పోర్ట్స్ ఎకో సిస్టం, గ్లోబల్ విజిబిలిటీ అనే నాలుగు ముఖ్య అంశాల ప్రాతిపదికన నూతన క్రీడా పాలసీని రూపొందించా రన్నారు దీనిలో అందరికీ ఆటలు, ప్రతిభ గుర్తింపు, అత్యుత్తమ శిక్షణ సౌక ర్యాలు, ప్రోత్సాహకాలు, ఉద్యోగాలు, భద్రత, క్రీడా సంఘాల సమన్వయం, ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ అంతర్జాతీయ క్రీడల నిర్వహణ, క్రీడా పర్యాటకం మొదలైన అంశాలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. ఒలింపిక్స్ లో స్వర్ణ పతక విజేతకు రూ.75 లక్షలు ప్రోత్సాహకంగా ఇచ్చేవారన్నారు. దానిని రూ.7 కోట్లకు పెంచా రన్నారు. ఒలింపిక్స్ రజత పతక విజేతకు గతంలో రూ.50 లక్షలు ప్రోత్సాహకంగా ఇచ్చేవారని, దానిని రూ.5కోట్లకు పెంచారన్నారు. ఒలింపిక్స్ కాంస్య పథక విజేతకు గతంలో రూ.30 లక్షలు ప్రోత్సాహకంగా ఇచ్చేవారని, దానిని రూ.3 కోట్లకు పెంచారన్నారు. ఒలింపిక్స్ లో పాల్గొన్న వారికి గతంలో రూ.5 లక్షలుగా ఉన్న ప్రోత్సాహకాన్ని రూ.50 లక్షలకు పెంచారన్నారు. ఆసియా క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు స్వర్ణ సాధిస్తే రూ.4 కోట్లు, రజితానికి రూ.3 కోట్లు, కాంస్యానికి రూ.కోటి, ఆసియా క్రీడల్లో పాల్గొన్న వారికి రూ.10లక్షలు ప్రోత్సాహకాన్ని ప్రకటించారన్నారు. ప్రపంచ ఛాంపియన్ షిప్ మరియు ప్రపంచ కప్‌ల్లో పాల్గొని స్వర్ణం సాధించిన వారికి రూ.50 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.35 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.25లక్షలు ప్రకటించారన్నారు. జాతీయ పాఠశాలల క్రీడలలో ప్రతిభ చూపి స్వర్ణ పథకం సాధించిన క్రీడాకారులకు రూ.10 లక్షలు రజిత పతకానికి రూ.5 లక్షలు కాంస్యం పథకం సాధించిన వారికి రూ.3 లక్షలు ప్రోత్సాహ కాలు ప్రకటించారని అన్నారు. అలాగే భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియా క్రీడల ప్రతిభకు కూడా ప్రోత్సా హకాలు పెంచుటకు నిర్ణయించిందని అన్నారు. వీటితోపాటు ఒలింపిక్స్ ఆసియా క్రీడల పతక విజేతలకు గ్రూప్-1 ఉద్యోగాలు, అమరావతిని క్రీడానగరంగా రూపొందించడం తో పాటు, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడల్లో సమీకత క్రీడా కాంప్లెక్స్ ఏర్పాటుకు నిర్ణయించారని అన్నారు. క్రీడా పాఠశాలలు, గిరిజన క్రీడా పాఠశాలలు నిర్వహించుటకు, మండల నియోజక వర్గ స్థాయిలలో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీలలో క్రీడా మైదానాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని అన్నారు దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన లీగ్ పోటీలలో రాష్ట్రం ప్రాతినిధ్యం, వహించనున్నదన్నారు. రాష్ట్రానికి వరంగా ఉన్న సముద్రతీరం, కొండలు, అడవులు, మొదలైన సహజ వనరులు వినియోగిస్తూ మౌంటైనీరింగ్, టైకింగ్, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ వంటి సాహస క్రీడలు ఏర్పాటుకు నిర్ణయించారన్నారు..అన్ని క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించారన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల ద్వారా క్రీడా రంగానికి మౌలిక సదుపాయా లు, శిక్షణ వసతులు కల్పనకు కషి మొదలైన అంశాలతో క్రీడా పాలసీ రూపుదిద్దుకుందన్నారు.ఈ సమీక్షలో సిఎం చంద్రబాబు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలపై ల్లాలోని క్రీడాధికారులు, క్రీడాశిక్షకులు, క్రీడాకారులు, క్రీడా సంఘాలు, క్రీడా ప్రేమికు లు క్రీడాభిమా నులు హర్షం వ్యక్తం చేస్తు న్నారని డిఎస్‌డిఒ ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్ తెలి పారు.